తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 03 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 335 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# పీఆర్సీపై కీలక నిర్ణయాలకు రంగం సిద్ధం

- ఉద్యోగుల సంక్షేమంపై సీఎం స్పష్టమైన హామీలు
- 100 రోజుల్లో రూ. 6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు
- ఉద్యోగ సంఘాలతో విస్తృత చర్చలు
- నిరసనలు ఉపసంహరణ

**హైదరాబాద్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పీఆర్సీ నివేదికను తక్షణమే అందించాలని అధికారుల కమిటీకి ఆదేశించినట్లు వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ), ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎం విస్తృతంగా చర్చించారు.

మిగతా 2లో..

# వరంగల్‌లో మెగా టెక్స్టైల్ పార్క్ ప్రారంభానికి సిద్ధం

**మే 10న మోదీ వర్చువల్‌గా ప్రారంభం**

**వేల కోట్ల పెట్టుబడులతో భారీ ప్రాజెక్ట్**

**ఉపాధి, ఎగుమతులకు ఊతమిచ్చే కేంద్రం**

**హైదరాబాద్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక మైలురాయి చేరువలో ఉంది. వరంగల్‌లో ఏర్పాటు చేసిన పీఎం మిత్రా కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను మే 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మెగా ప్రాజెక్ట్ దేశ టెక్స్టైల్ రంగానికి కొత్త దిశను చూపనుందని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సమగ్ర టెక్స్టైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ పార్క్ తయారీ, ఉపాధి, ఎగుమతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించనుంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ. 1,695.54 కోట్లుగా నిర్ణయించగా, మొత్తం పెట్టుబడులు రూ. 6,000 కోట్లకు పైగా చేరనున్నాయి. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు స్థిరపడ్డాయని అధికారులు తెలిపారు. 1,327 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ పార్క్ దేశంలోనే అతిపెద్ద టెక్స్టైల్ పార్క్‌లలో ఒకటిగా నిలవనుంది.

మిగతా 2లో..



## మీడియా అవార్డ్స్ వేదికపై జర్నలిజం ప్రాముఖ్యతకు గుర్తింపు

మంత్రి శ్రీధర్ బాబు పాల్గొనడం విశేషం

వివిధ రంగాల జర్నలిస్టులకు ఒకే వేదికపై సత్కారం

వేగవంతమైన కాలంలో విశ్వసనీయ జర్నలిజం అవసరం

అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపిన మంత్రి



2లో




## ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

**మరో రెండు రోజులు విద్యార్థులకు అవకాశం**

**ఆలస్య రుసుం రూ. 3 వేలతో చెల్లింపు**

2లో

## బీఆర్ఎస్ బలోపేతంపై కేటీఆర్ దిశానిర్దేశం

సభ్యత్వ నమోదు, కమిటీల నిర్మాణంపై చర్చ

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలని సూచన

రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్న పిలుపు



2లో

## పరేడ్ గ్రౌండ్స్ సభకు బీజేపీ భారీ సన్నాహాలు

- ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు దిశానిర్దేశం
- మే 10న మోదీ సభ విజయవంతానికి విస్తృత కార్యాచరణ
- లక్ష మందితో సభను విజయవంతం చేయాలని పిలుపు

2లో



## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతా

- మీట్ ది ప్రెస్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు
- "విద్య, వైద్యం ఉచితం కాకపోతే ప్రజలు ప్రశ్నించాలి"
- కేసీఆర్‌పై రాజకీయ విమర్శలే చేశానన్న స్పష్టీకరణ
- ప్రజల కోసం పోరాటమే లక్ష్యం

**హైదరాబాద్, మే 02 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందకపోతే ప్రజలు గట్టిగా ప్రశ్నించాలని, అవసరమైతే తీవ్ర నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. పాంచజన్యంలో ప్రకటించిన ఐదు ప్రధాన అంశాలను అమలు చేయడంలో తాను ఇచ్చిన మాట తప్పితే తాను బాధ్యత వహిస్తానని కవిత స్పష్టం చేశారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతా

(మొదటి పేజీ తరువాయి)

హామీలు ఇచ్చే ముందు ఆర్థిక నిపుణులతో చర్చించి సాధ్యాసాధ్యాలను అంచనా వేసిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ప్రాధాన్యత కేటాయిస్తే ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించడం సాధ్యమేనని వివరించారు. రాష్ట్రంలో ప్రజలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని విద్య, వైద్యానికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంకల్పం ఉంటే ఈ పరిస్థితిని మార్చవచ్చని, గతంలో ఆరోగ్య శ్రీ, ఉచిత భోజన పథకాలు కూడా మొదట విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ విజయవంతంగా అమలయ్యాయని గుర్తుచేశారు.

రాజకీయ విమర్శలపై స్పందిస్తూ, తన వ్యాఖ్యలు కేవలం రాజకీయ నేతగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై మాత్రమేనని, తండ్రిగా ఆయనతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. సిద్ధాంత పరమైన భేదాల కారణంగానే విమర్శలు చేశానని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణలో లోపాల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కవిత, ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే తల్లిలా ప్రజల కోసం పనిచేసే పాలన అందిస్తామని చెప్పారు. పార్టీ పేరుపై జరిగిన చర్చల గురించి మాట్లాడుతూ వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. పార్టీ స్థాపనలో అనేక సాంకేతిక, రాజకీయ అంశాలు ఉంటాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు చేసిన వారిని పట్టించుకోబోమని, ప్రజల కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

మహిళల సాధికారతపై ప్రత్యేకంగా మాట్లాడుతూ తమ పార్టీలో కనీసం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామని ప్రకటించారు. మహిళలు పరిపాలనలో ముందుకు రావాలని, తమ పార్టీ ఇందుకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ రాజకీయాలపై మాట్లాడుతూ డీలిమిటేషన్ వ్యవహారంలో రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, రాజ్యసభకు మరింత అధికారం కల్పించాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలకు సమాన ఓటింగ్ హక్కులు ఉండాలని చెప్పారు.

మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ ప్రధాన ప్రవాహంలోకి రావాలని, రాజకీయ పార్టీలలో చేరాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందని తెలిపారు. ప్రజల మద్దతుపై విశ్వాసం వ్యక్తం చేసిన కవిత, కొత్త ఆలోచనలను ఈ నేల ఎప్పుడూ ఆదరిస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, అభివృద్ధి, సామాజిక న్యాయం రెండు చక్రాల్లా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# పరేడ్ గ్రౌండ్స్ సభకు బీజేపీ భారీ సన్నాహాలు

**మేడ్చల్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధాని సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ శ్రేణులు వేగంగా సన్నాహాలు ప్రారంభించాయి. ఈ క్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లాలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని కీలక సూచనలు చేశారు.

కొంపల్లిలోని హైందవ నిమంత్రణ కన్వెన్షన్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్తో కలిసి ఈటల రాజేందర్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సభ నిర్వహణ, ప్రజల సమీకరణ, ప్రచార వ్యూహాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మెజారిటీ రావడం పార్టీ బలాన్ని చూపించిందని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. అదే ఉత్సాహంతో మళ్లీ మోదీ సభకు భారీగా ప్రజలను సమీకరించాలని సూచించారు. ప్రజలు మోదీ నాయకత్వాన్ని విశ్వసించి మళ్లీ ఆయనను ప్రధాని చేయాలనే సంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ బలపడుతోందని, గుజరాత్‌లో దీర్ఘకాలంగా పార్టీ విజయాలు సాధిస్తోందని ఉదాహరణగా చెప్పారు. ఒకప్పుడు తక్కువ స్థాయి నుంచి ప్రారంభమైన పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా ఎదిగిందని వివరించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ మరింత బలపడాల్సిన అవసరం ఉందని, ఆ లక్ష్యంతోనే మోదీ సభ నిర్వహిస్తున్నామని ఈటల రాజేందర్ తెలిపారు. మల్కాజిగిరి నుంచే మోదీ గత ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే స్థాయిలో ఈసారి కూడా స్పందన చూపించాలని కోరారు. పరేడ్ గ్రౌండ్స్ సభకు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి నుంచి లక్ష మందిని సమీకరించనున్నట్లు తాను హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆహ్వానించి సభను ఘనవిజయంగా నిలపాలని సూచించారు. సభ ద్వారా తెలంగాణలో పార్టీకి మరింత ఉత్సాహం, భరోసా కలగాలని ఆకాంక్షించారు.

మోదీ రోజుకు 365 రోజులు ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడని ఆయన కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలంగా ఉంటే డబ్బుతో పని లేదని, కట్టుదిట్టమైన వ్యవస్థతో ముందుకు సాగితే విజయం సాధ్యమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సమిష్టిగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# మీడియా అవార్డ్స్ వేదికపై జర్నలిజం ప్రాముఖ్యతకు గుర్తింపు

**హైదరాబాద్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ 2026 కార్యక్రమంలో తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు దుద్దిల్లా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మీడియా రంగానికి చెందిన ప్రతిభావంతుల్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ప్రింట్, టెలివిజన్, రేడియో, డిజిటల్ వేదికలలో సేవలందిస్తున్న జర్నలిస్టులను ఒకే వేదికపై గుర్తించడం అభినందనీయం అని మంత్రి పేర్కొన్నారు. ఈ అవార్డ్స్ ద్వారా మీడియా రంగంలో కృషి చేస్తున్న వారికి గౌరవం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో సమాచార ప్రసారం వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, విశ్వసనీయమైన జర్నలిజం పాత్ర మరింత ముఖ్యమైందని మంత్రి అన్నారు. నిజాయితీతో కూడిన వార్తలు సమాజానికి అవసరమని స్పష్టం చేశారు.

ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హైబిజ్ టీవీని మంత్రి అభినందించారు. మీడియా రంగాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. వారి కృషి ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మీడియా రంగం సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

# పీఆర్సీపై కీలక నిర్ణయాలకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు ఎంపీలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లు, సంక్షేమ అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. వచ్చే వంద రోజుల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు విడుదల చేసి చెల్లింపులు పూర్తి చేస్తామని ప్రకటించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు.



నిధుల వినియోగంలో ప్రాధాన్యతలను నిర్ణయించడంలో ఉద్యోగ సంఘాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమై సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. ఇది స్నేహపూర్వక ప్రభుత్వం అని, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం, జూన్ 1లోగా హెల్త్ కార్డులను అందజేస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగులు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి వల్లే సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా ప్రజలకు చేరుతున్నాయని సీఎం ప్రశంసించారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసం తీసుకున్న నిర్ణయాలను సీఎం వివరించారు. ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని, బదిలీల వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా టీచర్ల బదిలీల వంటి కీలక అంశాలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగావకాశాలను పెంచే చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించిన పలు డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు, ఈ నెల 5న చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని నాయకులు తెలిపారు. సీఎం నేతృత్వంలో ప్రభుత్వం ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని సీఎం మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వం, ఉద్యోగులు కలిసి పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

**హైదరాబాద్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును అధికారులు మరో రెండు రోజుల పాటు పొడిగించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ మేరకు మే 2 నుంచి మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. గడువు ముగిసేలోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆలస్య రుసుం రూ. 3 వేలతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఫెయిలైన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ముందుగానే ఫీజు చెల్లించుకోవాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సులభంగా ఫీజు చెల్లించే సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయదలచిన వారు తప్పకుండా ఈ గడువులో ఫీజు చెల్లించుకోవాలని హెచ్చరించారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి పొడిగింపు ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు మరో అవకాశం లభించిందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షలకు సిద్ధమవుతూ ఫీజు చెల్లింపును నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

# బీఆర్ఎస్ బలోపేతంపై కేటీఆర్ దిశానిర్దేశం

**హైదరాబాద్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక అంశాలు చర్చించారు. జిల్లాలో పార్టీని మరింత బలపర్చేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. కొత్త సభ్యులను చేర్చుకోవడంతో పాటు, కమిటీల నిర్మాణాన్ని సమర్థంగా పూర్తి చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించారు. ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు.

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి విజయాలు సాధించిన పార్టీ నేతలను కేటీఆర్ అభినందించారు. ఈ విజయాలను మరింతగా విస్తరించేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వ పనితీరును విశ్లేషించి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధమవ్వాలని కేటీఆర్ స్పష్టం చేశారు. సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులకు సూచించారు.



# వరంగల్‌లో మెగా టెక్స్టైల్ పార్క్ ప్రారంభానికి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పీఎం మిత్రా పథకం కింద ఎంపికైన బ్రౌన్‌ఫీల్డ్ మెగా టెక్స్టైల్ పార్క్‌గా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయం నుంచి వస్త్రాల తయారీ, ఫ్యాషన్ నుంచి ఎగుమతుల వరకు సమగ్ర అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఫార్మ్ నుంచి ఫైబర్, ఫైబర్ నుంచి ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ నుంచి ఫ్యాషన్, ఫ్యాషన్ నుంచి విదేశాలకు అనే దృష్టితో ఈ పార్క్ రూపొందించబడింది. వరంగల్ ప్రాంతానికి ఈ ప్రాజెక్ట్ భారీ ఉపాధి అవకాశాలు తీసుకురానుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు లభించడంతో పాటు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఇది దోహదపడనుంది.

# కిశోర బాలికల కోసం 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ప్రారంభం

**డెస్క్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల కోసం 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ఘనంగా ప్రారంభమయ్యాయి. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ఆధ్వర్యంలో ఈ క్యాంపులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించబడుతున్నాయి. మే 2 నుంచి జూన్ 10 వరకు కొనసాగనున్న ఈ క్యాంపుల్లో టీనేజ్ బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. వారి సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

క్యాంప్‌లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు, గ్రామాలను బాలికలకు సురక్షిత ప్రదేశాలుగా తీర్చిదిద్దే అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామాజిక సవాళ్లను గుర్తించి పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ అలవాట్లు, పొదుపు ప్రాముఖ్యతపై కూడా శిక్షణ ఇస్తున్నారు. శారీరక వ్యాయామం, క్రీడలు, యోగా వంటి అంశాలను ప్రోత్సహిస్తూ ఆరోగ్యకర జీవనశైలిపై దృష్టి సారిస్తున్నారు.

విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధి పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైబర్ భద్రత, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంచుతున్నారు.

బాలికల సాధికారతకు భాగంగా 18 సంవత్సరాల బాలికలకు సైకిల్ శిక్షణ అందిస్తున్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి కృతజ్ఞత కార్యక్రమాలు, పిల్లల గ్రామ సభలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధం, విద్య ప్రోత్సాహంపై నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు. కీలక శాఖల సమన్వయంతో జరుగుతున్న ఈ క్యాంపుల ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, సురక్షితమైన భవిష్యత్తు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 03 - మే 2026
వరంగల్




## హుజురాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం – యువకుడు అక్కడికక్కడే మృతి

**హుజురాబాద్,మే 02(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

మృతుడు జూపాక గ్రామానికి చెందిన కేతిరి విక్రమ్ రెడ్డి అని పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది




## జమ్మికుంటలో సీఐ పులి వెంకట్‌కు అద్భుత స్వాగతం

**జమ్మికుంట టౌన్ మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన సీఐ పులి వెంకట్‌కు స్థానికంగా ఘన స్వాగతం లభించింది. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌తో సేవలు అందించాలని ఆశిస్తూ, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా శాలువా కప్పి సన్మానించిన రామారావు, రాములవారి ముత్యాల తళంబ్రాలు అందజేసి, స్వామివారి ఆశీస్సులను సూచించే ప్రసాదాన్ని బహుకరించారు. ఈ సత్కారం ఆధ్యాత్మిక వాతావరణంలో జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఐ పులి వెంకట్ మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల భద్రతే తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజలతో సాన్నిహిత్యం పెంచుతూ, న్యాయబద్ధంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, సీఐ గారిని దేవస్థానాన్ని సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి, ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సలీం, యూత్ కాంగ్రెస్ నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొని సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగి, పోలీస్–ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నిలిచింది.



## పెద్దమందడి సింగిల్ విండో సీఈఓ జగదీశ్వర్ రెడ్డిని సన్మానించిన వెల్టూర్ నాయకులు

**పెద్దమందడి,మే02(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి సింగిల్ విండో సీఈఓ జగదీశ్వర్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా వెల్టూర్ గ్రామ నాయకులు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. శనివారం నిర్వహించిన పదవి విరమణ కార్యక్రమంలో వెల్టూర్ గ్రామానికి చెందిన నాయకులు, రైతులు కలిసి జగదీశ్వర్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జగదీశ్వర్ రెడ్డి తన ఉద్యోగ జీవితంలో రైతులకు అందుబాటులో ఉంటూ నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. రైతు సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, సహనంతో వ్యవహరించిన తీరు అభినందనీయమని పేర్కొన్నారు. సింగిల్ విండో ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలని వెల్టూర్ గ్రామ నాయకులు ఆకాంక్షించారు.తమకు ఎల్లప్పుడూ సహకరించిన జగదీశ్వర్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సి. వెంకటేశ్వర్లు, రఘువర్ధన్ రెడ్డి, బుసయ్య, రవీందర్, చిత్తూరు కృష్ణారెడ్డి, కుమ్మరి కొండన్న, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.





## ప్రజలకు సేవ చేసే అదృష్టం కార్పొరేటర్ గా మీకు లభించింది..

◆ మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం బ్యూరో, మే 2(తెలంగాణ ముచ్చట్లు )** అనునిత్యం ప్రజల్లో ఉండి మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను గడప గడపకు తిరిగి ప్రజలకు వివరించాలి.. కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.. ఈనెల 7న పదవి విరమణ చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయం నందు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మీరు కార్పొరేటర్లుగా గెలిచారని ప్రజలకు ఎన్నో సేవలు అందించారని ఎప్పుడు ప్రజల్లో ఉండి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ పరిపక్వత లేని వాళ్ళే నన్ను వదిలి పోయారు.. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లు నాతో ఉన్నారు.ఎవరు పోయిన ఇప్పుడు కార్పొరేషన్ పాలించే వాళ్ళకు నేను పెట్టిన బిక్ష..
నాతో ఉన్న వాళ్ళకు ఈరోజే టికెట్లు ఏనౌన్స్ చేస్తున్న..మీరు చేసిన సేవలు ఎప్పటికి మర్చిపోను..పార్టీ మారినోడి పరిస్థితి కన్నా ఉన్నవాళ్ల పరిస్థితి మెరుగ్గా ఉండి..మన ప్రవర్తన బట్టే ప్రజలు గుర్తు పెట్టుకుంటారు.. రాబోయే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ది చెప్పాలని తయారుగా ఉన్నారు. మరలా రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో సైతం కష్టపడి అత్యధిక స్థానాలు గెలవాలని పిలుపు నిచ్చారు.
సన్మానం చేసిన వారిలో కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ,షేక్ మక్బూల్,దండా జ్యోతి రెడ్డి,నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు,శీలంశెట్టి రమ వీరభద్రం,తోట గోవిందమ్మ రామారావు,మాటేటి అరుణ నాగేశ్వరరావు,బిక్కసాని ప్రశాంతి లక్ష్మి జస్వంత్,పసుమర్తి రామ్మోహన్,బుర్రి వెంకట్ కుమార్,బుడిగం శ్రీనివాస్, ముక్కాల కమల,పల్లా రోజ్లీనా, పగడాల శ్రీ విద్య లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జే సి కృష్ణ,మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మాజీ గ్రంధాలయం చైర్మన్ ఖమర్,మాజీ సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగ చంద్ర రెడ్డి,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, నాయకులు అమరగాని వెంకన్న, మిర్చిశాఖా అధ్యక్షులు మెంతుల శ్రీశైలం,లీగల్ సెల్ కొత్త వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు కొల్లు పద్మ, షకీనా,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## ప్రాణాలకు ముప్పు... హుజురాబాద్ వద్ద
# వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్‌కు గట్టి వ్యతిరేకం

**హుజురాబాద్, మే 2(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణానికి సమీపంలోని సిర్సపల్లి గ్రామ శివారులో ప్రతిపాదించిన వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని వేస్ట్ టు ఎనర్జీ వ్యతిరేక ఐక్య పోరాట అఖిల పక్ష కమిటీ డిమాండ్ చేసింది. గత నెల రోజులుగా కొనసాగుతున్న నిరసన దీక్షలో భాగంగా శనివారం పద్మశాలి సంఘం హుజురాబాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చందుపట్ల జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల చెత్త నుంచి వెలువడే రసాయనాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో పంటలు పండకపోవడంతో పాటు, కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.
అదేవిధంగా చెత్తను కాల్చడం ద్వారా ఉత్పత్తి అయ్యే డయాక్సిన్ వంటి విషవాయువులు గాలిని కలుషితం చేసి, ప్రజల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు అధికమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రాజెక్టును రద్దు చేయించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల యాదగిరి, విడపు రాజు, చిలుక మారి శ్రీనివాస్, సబ్బని రాజేందర్, మంచికట్ల మురళి, ఎం. రమేష్, ఈ. చంద్రశేఖర్, ఎస్. సత్యనారాయణ, ఎం. బిక్షపతి, ఈ. సాగర్, ఎం. వెంకట్రాజం, ఈ. వెంకటేశ్వర్లు, టి. దేవేందర్, ఎం. విజయ్, టి. సంపత్ కుమార్, ఎం. వెంకటేశ్వర్లు, కే. ప్రభాకర్, కే. రామచంద్రం, జేఏసీ నాయకులు గుడిపాటి జయపాల్ రెడ్డి, వీ. రత్నం, సందేల వెంకన్న, మార్త రవీందర్, వెంకట్రావు, టి. హనుమంతరావు, రాజేశ్వరరావు తదితరులతో పాటు చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ వెంటే మేమున్నాం.. మీ కష్టాలను తీరుస్తాం!

**బోదులబండ ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి అభయం**

**ఖమ్మం బ్యూరో, మే 2(తెలంగాణ ముచ్చట్లు ):** "మీ కష్టాలను వినేందుకు, మీ కన్నీళ్లు తుడిచేందుకే ప్రభుత్వం మీ గడప వద్దకు వచ్చింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు మేము విశ్రమించం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొని, జనంతో నేరుగా మమేకమయ్యారు.
అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు అతీతం
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత



పదేళ్లుగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించే తమ ప్రభుత్వం 'ప్రజల వద్దకే పాలన'ను తీసుకువచ్చిందని చెప్పారు. "రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మే నెలాఖరులో రెండో దశ మంజూరు చేస్తాం. ప్రతి సోమవారం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం" అని స్పష్టం చేశారు.
భూ సమస్యలకు చరమగీతం
భూ సమస్యల ద్వారా రైతులు పడుతున్న ఇబ్బందులను రాబోయే రెండు నెలల్లో పరిష్కరించి, రైతులకు మేలు చేకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర్‌తో కలిసి మంత్రి గంటల తరబడి ప్రజల మధ్యే ఉండి వందలాది మంది ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతి వారం దీనిపై సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పంట మార్పిడి ద్వారా స్థిరమైన ఆదాయం సాధ్యం



**ఎల్కతుర్తి, మే 02( తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో శనివారం రోజు "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నేరుగా రైతులను కలుసుకుని వ్యవసాయంలో అనుసరించాల్సిన ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వినియోగంతో సాగు ఖర్చులను తగ్గించుకోవడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరమని సూచించారు. అలాగే అవసరమైన మేరకు మాత్రమే రసాయనాల వినియోగం ద్వారా ప్రకృతిని సంరక్షించుకోవాలని తెలిపారు.

పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి వంగడాలను పండించి రైతులు ఆర్థికంగా లాభపడవచ్చని పేర్కొన్నారు. సేంద్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు చురుకుగా స్పందించి, శాస్త్రవేత్తలు అందించిన సూచనలు మరియు సాంకేతికతలను తమ వ్యవసాయంలో అమలు చేస్తామని తెలిపారు.

# జమ్మికుంట రహదారి డేంజర్ జోన్‌గా మారింది



**జమ్మికుంట టౌన్ మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట నుండి కరీంనగర్ వెళ్ళు ప్రధాన రహదారి ఇప్పుడు వాహనదారులకు భయానక అనుభవంగా మారింది. ఆబాది జమ్మికుంట పరిధిలో రైతులు రహదారిపై మక్కలు, వడ్లు పోసి ఒక వైపు పూర్తిగా ఆక్రమించుకోవడంతో సాధారణ ప్రయాణం సాహసంగా మారింది. పగటి వేళల్లో పరిస్థితి ఏదోలా కనిపించినా, రాత్రి వేళల్లో మాత్రం ఈ రహదారి నిజంగా "ప్రమాదపు బాట"గా మారుతోంది. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకుండా, లైటింగ్ సౌకర్యం లేకుండా రహదారిపై ముళ్ళకంపలు, ధాన్యం కుప్పలు ఉండటంతో డ్రైవర్లు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. ఒక వైపు మాత్రమే రహదారి అందుబాటులో ఉండటంతో వాహనాలు అదే దారిలో వెళ్తుంటాయి. కానీ కొంతదూరం వెళ్లగానే డివైడర్ ఎదురవడంతో ఎటు వెళ్లాలో అర్థంకాక గందరగోళం నెలకొంటోంది. కొత్తగా వచ్చే వాహనదారులు చివరి క్షణంలో దారి మళ్లించాల్సి రావడం వల్ల ప్రమాదాలు తప్పడం లేదు. దాదాపు ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర ఈ పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రతిరోజూ కరీంనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "చీకట్లో రోడ్డు కనిపించక మక్కల కుప్పల్లో పడే పరిస్థితి వస్తోంది" అని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులు రాత్రిపూట కనీసం పెద్ద లైట్లు ఏర్పాటు చేయాలని, హెచ్చరిక బోర్డులు పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే అధికారులు వెంటనే స్పందించి రహదారిని సురక్షితంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా... లేదా ప్రమాదం జరిగాకే స్పందిస్తారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ – చిన్నారుల భవిష్యత్తుకు బాటలు

- పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగ



**పెద్దమందడి,మే02(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని 2వ మరియు 4వ అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు పాలు, గుడ్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సూర్య గంగ రవి, ఉప సర్పంచ్ బోయిని ఉషన్న యాదవ్ కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సూర్య గంగ రవి మాట్లాడుతూ.. చిన్నారులకు బాల్య దశ నుంచే నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.పిల్లలకు పుస్తక జ్ఞానంతో పాటు కథలు, పాటలు, ఆటల ద్వారా బోధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆసక్తికరమైన బోధనా విధానాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు.అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్య గంగ రవి, ఉప సర్పంచ్ బోయిని ఉషన్న యాదవ్, టైలర్ రవి, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, రాణి, ఆయాలు అంజమ్మ, సాయి లీల, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# జమ్మికుంటలో కో-ఆప్షన్ ఎన్నికకు తాత్కాలిక విరామం

**జమ్మికుంట టౌన్ మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించాల్సిన కోఆప్షన్ ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ నుంచి కోఆప్షన్ కోసం పోటీకి వచ్చిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అభ్యర్థుల ప్రజాసేవ పట్ల నిబద్ధత, అనుభవం, అలాగే సామాజిక సమతుల్యతను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. బిఆర్ఎస్ నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు ఉండటంతో ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ధ్రువీకరణ అంశాలను పారదర్శకంగా నిర్వహించేందుకు కొంత సమయం అవసరమైందని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సందేహాలకు తావు లేకుండా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరియు పార్టీ సీనియర్ నాయకులతో చర్చించి, వారి సూచనలు తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. పార్టీని స్థానికంగా బలోపేతం చేయడం, ప్రజల్లో పాలకవర్గంపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో పరిశీలన అనంతరం కోఆప్షన్ ఎన్నికను పారదర్శకంగా నిర్వహిస్తామని చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

# పామాయిల్ రైతులకు గుడ్ న్యూస్.!

- ఏప్రిల్‌కు ఎఫ్ఎఫ్‌బీ ధర రూ.23,501గా ఖరారు. మంత్రి తుమ్మలకు రైతుల కృతజ్ఞతలు.



**అశ్వారావుపేట, మే 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులకు ఊరటనిచ్చే విధంగా గెలల టన్ను ధరను ఓఈఆర్ 20.01 శాతాన్ని ఆధారంగా రూ.23,501గా నిర్ణయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలసి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధర నిర్ణయంలో తీసుకున్న నిర్ణయం రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యంగా ఓఈఆర్ శాతాన్ని పెంచి ధర నిర్ణయించడం వల్ల రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తోందని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న ఈ విధానాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆయిల్ పామ్ గెలల ధరను నిర్ణయించడం పట్ల అక్కడి రైతుల్లో ఆనందం నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో ఓఈఆర్ 18 శాతం ఉండగా, తెలంగాణలో 20.01 శాతం ఉండటంతో ధరలు పెరగడం రైతులకు లాభదాయకంగా మారిందని రైతు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ విధానం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ధరలు పెరగడం రైతులకు అనుకూల పరిస్థితులను సృష్టించిందని తెలిపారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలపాటికి వివరించారు. సాగు విస్తీర్ణం పెంపుతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల గెలల టన్ను ధర రూ.23,501గా నిర్ణయించడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం తమకు ఆర్థిక భరోసాను కల్పించిందని, భవిష్యత్తులో ఇంకా ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# పెద్దమందడి సింగిల్ విండో సీఈవో జగదీశ్వర్ రెడ్డికి ఘన వీడ్కోలు

**పెద్దమందడి,మే02( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి సింగిల్ విండో సీఈవో జగదీశ్వర్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం శనివారం పెద్దమందడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకులు, రైతులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై జగదీశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జగదీశ్వర్ రెడ్డి తన ఉద్యోగ జీవితంలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావంతో పనిచేసి రైతులకు అందుబాటులో ఉంటూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. రైతు సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, సహనంతో వ్యవహరించిన తీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

సింగిల్ విండో అభివృద్ధి, రైతులకు అవసరమైన సేవలు అందించడంలో జగదీశ్వర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, సహచర ఉద్యోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి మంచి గుర్తింపు పొందారని నాయకులు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, రైతులు, సహచర సిబ్బందికి జగదీశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో అందరి సహకారంతోనే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పత్రికా స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి ప్రాణం

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,మే02(తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం మే 3వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ తెలిపారు.1993లో ఐక్య రాజ్యసమితి ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందని, 1991లో నమీబియాలోని విండ్‌హోక్‌లో జరిగిన సమావేశంలో పత్రికా స్వేచ్ఛకు మద్దతుగా చేసిన ప్రకటనకు గుర్తుగా మే 3వ తేదీని ఎంపిక చేశారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం లేదా ఇతర శక్తుల ఒత్తిళ్లు లేకుండా, భయభ్రాంతులకు గురికాకుండా వార్తలను సేకరించి ప్రజలకు అందించే హక్కే పత్రికా స్వేచ్ఛ అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికా స్వేచ్ఛ మూలస్తంభమని, నిజాలను ప్రజల ముందుంచడం, అధికారులను ప్రశ్నించడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తేవడం మీడియా ప్రధాన బాధ్యత అని తెలిపారు.స్వేచ్ఛగా పనిచేసే పత్రికలు లేకపోతే ప్రజాస్వామ్యం నిలబడదని, ప్రజలకు నిజమైన సమాచారం అందినప్పుడే వారు సరైన నిర్ణయాలు తీసుకోగలరని అన్నారు. కుంభకోణాలు, అక్రమాలు వెలుగులోకి రావడంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, బాధితుల గొంతును ప్రపంచానికి వినిపించేది కూడా మీడియానేనని పేర్కొన్నారు.ప్రస్తుతం జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, సెన్సార్ విధానాలు, ఫేక్ న్యూస్ వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక దేశాల్లో నిజం రాసినందుకు జర్నలిస్టులు జైలు పాలవుతున్నారని అన్నారు.డిజిటల్ యుగంలో తప్పుడు వార్తలు వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడం కేవలం జర్నలిస్టుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా నిజమైన వార్తలను చదవడం, ఫేక్ న్యూస్‌ను నమ్మకపోవడం, నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు అండగా నిలవడం అవసరమని తెలిపారు.చివరగా, పత్రికా స్వేచ్ఛ అంటే సమాజ స్వేచ్ఛ. అది ఉంటేనే ప్రజల గొంతు వినిపిస్తుంది అని పేర్కొంటూ ప్రజల పక్షాన నిలబడే ప్రతి జర్నలిస్టుకు ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# సుప్రీంకోర్టులో మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

పశ్చిమబెంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌లో మమతా బెనర్జీకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపుకు సిబ్బందిని ఎంపిక చేసే విషయంలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం సరైనదేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఓట్ల లెక్కింపుకు కేంద్ర ప్రభుత్వ సిబ్బందినే నియమించాలనే ఎన్నికల సంఘం సర్క్యులర్‌పై టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మొదట కలకత్తా హైకోర్టును ఆశ్రయించినా అక్కడ ఉపశమనం లభించలేదు. హైకోర్టు కూడా ఎన్నికల సంఘం నిర్ణయంలో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేసింది.



దీనిపై అసంతృప్తితో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమతా బెనర్జీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఏప్రిల్ 13న జారీ చేసిన సర్క్యులర్ వివరాలు ఆలస్యంగా తమకు తెలియజేయబడినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసును జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫున కౌంటింగ్ సిబ్బందిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మిశ్రమంగా ఉంటారని, రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఉంటాడని వివరించారు. సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

టీఎంసీ వ్యక్తం చేసిన అక్రమాల ఆందోళనలు ఆధారంలేనివని ఎన్నికల సంఘం వాదించింది. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని కోర్టుకు స్పష్టం చేసింది. వాదనలు పూర్తైన తరువాత ధర్మాసనం టీఎంసీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. సర్క్యులర్ అమలు కావాలని కోరుకుంటూనే కోర్టుకు ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ, ఇకపై ఈ అంశంపై తదుపరి ఆదేశాలు అవసరం లేదని స్పష్టం చేసింది.

# ఆఫ్రికాలో భారత సైన్యం ప్రతిష్టాత్మక విన్యాసాలు ముగింపు



బహుళ దేశాల ప్రత్యేక దళాల సంయుక్త విన్యాసం 'ఫ్లింట్‌లాక్-2026' విజయవంతంగా ముగిసింది. ఈ విన్యాసాలు కోట్ దివ్వార్లో నిర్వహించబడగా, భారత సైన్యం కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆఫ్రికా దేశాలతో భారత రక్షణ సహకారం మరింత బలపడింది. ఈ విన్యాసాల్లో ప్రత్యేక ఆపరేషన్లపై విస్తృత శిక్షణలు నిర్వహించారు. వివిధ దేశాల సైన్యాలు కలిసి పనిచేస్తూ వ్యూహాత్మక నైపుణ్యాలను పరస్పరం పంచుకున్నాయి. ముఖ్యంగా గినియా దేశ సైనికులతో కలిసి భారత బలగాలు సంయుక్తంగా శిక్షణ పొందడం విశేషంగా నిలిచింది. ఇలాంటి విన్యాసాల ద్వారా సైన్యాల మధ్య సమన్వయం, పరస్పర నమ్మకం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదం, భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ తరహా శిక్షణలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

భారత్ ఆఫ్రికా దేశాలతో రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉందని వెల్లడించింది. గ్లోబల్ భద్రతలో కీలక భాగస్వామిగా నిలవాలన్న లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు ఈ విన్యాసం ద్వారా భారత్-ఆఫ్రికా సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంయుక్త కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రపంచ భద్రత, శాంతి స్థాపనలో భారత సైన్యం తన పాత్రను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందని ఈ విన్యాసం మరోసారి నిరూపించింది.

# చర్చలు నిలిచిపోవడంతో యుద్ధ భయం

మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలు పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు ముందుకు సాగకపోవడంతో పరిస్థితి అనిశ్చితంగా మారింది. చర్చలు ఎప్పుడు జరుగుతాయో, జరుగుతాయో లేదో స్పష్టత లేకపోవడంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో, ఈ పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఒప్పందం రద్దయితే మళ్లీ యుద్ధం ప్రారంభమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అంశంపై ఇరాన్ అధికార వర్గాలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.



ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ జాఫర్ అసాది మాట్లాడుతూ, అమెరికాతో యుద్ధం జరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఒప్పందాల విషయంలో అమెరికా ఆసక్తి చూపడం లేదని, ద్వైపాక్షిక అంశాలపై చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. అమెరికా తీసుకుంటున్న తాజా నిర్ణయాలు, ప్రకటనలు చూస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. చమురు ధరలను ప్రభావితం చేయడం, అంతర్జాతీయ గందరగోళాన్ని తగ్గించుకోవడం కోసం అమెరికా ఈ చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు.

ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధం తప్పదనే భావన పెరుగుతోందని, అందుకు తమ సైన్యం పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. సైనిక దళాలు హై అలర్ట్‌లో ఉన్నాయని, ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన చర్చల సందర్భంగా ఇరాన్ చేసిన ప్రతిపాదనలను డోనాల్డ్ ట్రంప్ తిరస్కరించడం ఈ ఉద్రిక్తతలకు మరింత ఊపిరినిచ్చింది. ఈ పరిణామాలతో ఇరాన్ నుంచి కఠినమైన ప్రకటనలు వెలువడుతున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# మండుటెండలకు ముగింపు సంకేతాలు

దేశాన్ని వేధిస్తున్న మండుటెండలకు త్వరలోనే ఉపశమనం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ విభాగం తాజా అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాలు ఈసారి సాధారణ సమయం కంటే ముందుగానే దేశంలో ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ నెల 14 నుంచి 16 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. సాధారణంగా ఈ ప్రక్రియ కొంచెం ఆలస్యంగా ప్రారంభమవుతుండగా, ఈసారి ముందుగా రావడం గమనార్హంగా భావిస్తున్నారు.



దీనివల్ల ఎండల తీవ్రత క్రమంగా తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే ప్రారంభమైతే దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారత ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఇది వ్యవసాయ రంగానికి కొంత ఉపశమనం కలిగించే అంశంగా భావిస్తున్నారు. అయితే అన్ని ప్రాంతాల్లో సమానంగా వర్షాలు పడవని కూడా హెచ్చరించారు. ఈశాన్య ప్రాంతాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఇది అక్కడి రైతులకు సవాలుగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇక మే నెలలో వేడి ప్రభావం కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు. పగటిపూట మాత్రమే కాకుండా రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో సముద్ర తేమతో కూడిన గాలుల వల్ల ఉక్కపోత అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

# దేశవ్యాప్తంగా మొబైల్‌లలో ఎమర్జెన్సీ అలర్ట్ మోగింపు




దేశవ్యాప్తంగా కోట్లాది మంది మొబైల్ ఫోన్లలో అకస్మాత్తుగా ఎమర్జెన్సీ అలర్ట్ సందేశం వినిపించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రిల్‌లో భాగంగా "ఎక్స్‌ట్రీమ్ సీవియర్ అలర్ట్" పేరుతో నోటిఫికేషన్ పంపించారు. భారీ శబ్దంతో పాటు వైబ్రేషన్ కలిగి ఉన్న ఈ సందేశం ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ కొత్త తరహా సెల్ బ్రాడ్‌కాస్ట్ హెచ్చరిక వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది. ఈ ప్రకారం ఉదయం 11.46 గంటలకు దేశవ్యాప్తంగా మొబైల్ ఫోన్లపై అలర్ట్ ప్రత్యక్షమైంది. ఫ్లాష్ సందేశంలా కనిపిస్తూ గట్టిగా ట్యూన్ వినిపించడం ప్రత్యేకంగా కనిపించింది. ఇది నిజమైన ప్రమాదం కాదని, కేవలం పరీక్షలో భాగమేనని అధికారులు స్పష్టం చేశారు.

ఈ వ్యవస్థను ప్రారంభించిన వారిలో అమిత్ షా, సింధియా ఉన్నారు. ఈ ప్రాజెక్టును సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ అభివృద్ధి చేసింది. సాచెట్ వేదికపై ఈ అలర్ట్ వ్యవస్థను రూపొందించి దేశవ్యాప్తంగా అమలు చేశారు. ఈ అలర్ట్ సందేశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. విపత్తు సమయాల్లో ప్రజలకు త్వరగా సమాచారం చేరుతుందా లేదా అన్నది పరీక్షించడానికే ఈ డ్రిల్ నిర్వహించబడిందని తెలిపింది. ప్రత్యేకంగా ఈ అలర్ట్ వ్యవస్థ సైలెంట్ మోడ్ లేదా డూ నాట్ డిస్టర్బ్‌లో ఉన్న ఫోన్లలో కూడా వినిపించడం గమనార్హం. గట్టిగా అలారం మోగుతూ వెంటనే వినియోగదారుడి దృష్టిని ఆకర్షించేలా రూపకల్పన చేశారు. భూకంపాలు, సునామీలు, పిడుగుపాట్లు వంటి సహజ విపత్తులు జరిగినప్పుడు, అలాగే గ్యాస్ లీకేజీలు లేదా రసాయన ప్రమాదాల సమయంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. ప్రజల ప్రాణాలను రక్షించడంలో ఇది ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

# అమృత్‌సర్ విమానాశ్రయంలో కే9 వీరుడు మ్యాక్స్‌కు ఘన వీడ్కోలు

విమానాశ్రయ భద్రతలో కీలక పాత్ర పోషించిన కే9 వీరుడు 'మ్యాక్స్'కు అమృత్‌సర్ విమానాశ్రయంలో ఘన వీడ్కోలు పలికారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. మ్యాక్స్ తన సేవాకాలంలో విమానాశ్రయ భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రయాణికుల భద్రతను నిర్ధారించడంలో అతని నిబద్ధత, చురుకుదనం ప్రత్యేక గుర్తింపు పొందాయి. సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి భుజానికిభుజం కలిపి పనిచేస్తూ అనేక సందర్భాల్లో తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో అమృత్‌సర్ విమానాశ్రయ అధికారులు, సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూపేందర్ సింగ్, తుషార్ డి సఖారే వంటి అధికారులు హాజరై మ్యాక్స్ సేవలను కొనియాడారు.

మ్యాక్స్ సేవలు విమానయాన భద్రతను మరింత బలోపేతం చేశాయని అధికారులు పేర్కొన్నారు. అతని సేవలు సీఐఎస్ఎఫ్ దళానికి గర్వకారణమని తెలిపారు. కే9 దళాలు దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి సేవలను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని అధికారులు అన్నారు. మ్యాక్స్ సేవలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. దేశ భద్రతకు అంకితమైన ఈ కే9 వీరుడికి గౌరవంగా నివాళులు అర్పించారు.

# పూణేలో చిన్నారిపై దారుణం.. నిందితుడు అరెస్ట్

మహారాష్ట్రలోని పూణే పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై ఓ వృద్ధుడు అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం భోర్ తహసీల్ పరిధిలోని గ్రామంలో ఈ ఘటన జరిగింది. చిన్నారిని ఆహారం ఇస్తానని చెప్పి ఓ వృద్ధుడు తనతో తీసుకెళ్లాడు. అనంతరం సమీపంలోని పశువుల పాకలోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభమైంది. సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాల్లో నిందితుడు చిన్నారిని తీసుకెళ్తున్నట్లు రికార్డు కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసును మరింతగా విచారిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళనకు దిగారు. బెంగళూరు-ముంబై జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ రాకపోకలను అడ్డుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, త్వరగా ఛార్జిషీట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది. ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు కూడా తీవ్రంగా స్పందించగా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# ఇరాన్ ఒప్పందంపై ట్రంప్ అసంతృప్తి

డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం అంశంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ చేసిన ప్రతిపాదనలు సంతృప్తికరంగా లేవని ఆయన స్పష్టం చేశారు. అయితే మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ చర్చలకు సిద్ధమని సంకేతాలు ఇవ్వడం గమనార్హం. దీంతో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. గత రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితిపై ఇంకా ప్రతిష్టంభన నెలకొంది. ఇరాన్-అమెరికా సంబంధాలపై అంతర్జాతీయ వేదికలలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అమెరికా మిత్రదేశాలు ఈ అంశంపై భిన్న అభిప్రాయాలను వెల్లడించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చుతోంది.



ఇదే సమయంలో అమెరికా కొన్ని కీలక చర్యలకు దిగింది. జర్మనీలో ఉన్న సుమారు ఐదు వేల మంది సైనికులను ఉపసంహరించుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఇది యూరప్ భద్రతా వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా భావిస్తున్నారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రైడ్‌రిచ్ మెర్జ్ వైఖరిని ట్రంప్ ఇటీవల విమర్శించారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల దిగ్బంధనం పైరసీ తరహాలో కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ఇరాన్ చర్యలు అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

ఇరాన్‌తో ఒప్పందం చేసుకోవాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనలు అంగీకారయోగ్యం కావని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ నేతలు అంతర్గతంగా విభజనలో ఉన్నారని, తాము అంగీకరించలేని షరతులు కోరుతున్నారని అన్నారు. అయినప్పటికీ ఫోన్ ద్వారా సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరాన్ అణు ఆయుధాన్ని సమీకరించకుండా అడ్డుకుంటామని అమెరికా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో చర్చలు ఎటువంటి మలుపు తిరుగుతాయో అనేది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సేవలకు బ్రేక్

అమెరికాలో ఇంధన ధరల పెరుగుదల ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ విమాన యాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ అన్ని ఫ్లైట్ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే సంస్థ కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో ముగింపు పలుకనున్నట్లు వెల్లడించింది.

ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్న సంస్థకు విమాన ఇంధన ధరల పెరుగుదల పెద్ద దెబ్బగా మారింది. పరిస్థితులు మరింత క్లిష్టంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సంస్థ తెలిపింది. "మా అన్ని విమాన సర్వీసులను రద్దు చేశాం. ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు రావద్దు" అని సంస్థ మాతృసంస్థ ప్రకటించింది. కస్టమర్ సేవలు కూడా ప్రస్తుతం అందుబాటులో లేవని వెల్లడించింది.

ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు రీఫండ్ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని సంస్థ తెలిపింది. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ మాట్లాడుతూ.. ఇంధన ధరల ఆకస్మిక పెరుగుదల కారణంగా పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిందన్నారు. సంస్థను కొనసాగించడానికి భారీగా నిధులు అవసరమని, కానీ ఆ స్థాయిలో నిధులు సమీకరించే అవకాశం లేదని తెలిపారు.

ఇరాన్‌తో యుద్ధ పరిస్థితులు తీవ్రతరమైన తర్వాత అమెరికాలో విమాన ఇంధన ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. దీంతో అనేక ఎయిర్‌లైన్స్ తమ లాభాల అంచనాలను తగ్గించుకోవాల్సి వచ్చింది. కొత్త పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలకు కూడా బ్రేక్ పడింది.

ఇప్పటికే అప్పుల భారం, నిర్వహణ లోపాల కారణంగా ఈ సంస్థ 2024లోనే దివాలా ప్రకటించింది. ఆ తర్వాత పునర్వ్యవస్థీకరణ ద్వారా తిరిగి సేవలు ప్రారంభించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో నిలబడలేకపోయింది. సంస్థను రక్షించేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిగినప్పటికీ, అవి ఫలితం ఇవ్వలేకపోయాయి.

మొత్తానికి, ఇంధన ధరల ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఉదాహరణగా నిలిచింది. విమానయాన రంగంపై గ్లోబల్ పరిస్థితులు ఎంతటి ప్రభావం చూపుతున్నాయో ఈ పరిణామం స్పష్టంగా చూపిస్తోంది.







# హెచ్‌యూఎల్ ధరల పెంపు.. సామాన్యుడికి భారం

సామాన్య వినియోగదారులపై మరో ధరల భారం పడబోతోంది. ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ హిందూస్థాన్ యూనీలీవర్ తమ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. సబ్బులు, షాంపూలు, డిటర్జెంట్లు వంటి నిత్యావసర వస్తువులు ఇకపై మరింత ఖరీదవనున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగాయి. అలాగే ప్లాస్టిక్, రసాయనాలు వంటి ముడిసరుకుల ధరలు 8 నుంచి 10 శాతం వరకు పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది.పెరిగిన వ్యయాలను తట్టుకోవడం కష్టంగా మారడంతో ధరల సర్దుబాటు తప్పనిసరి అయిందని సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని ఉత్పత్తులపై 2 నుంచి 5 శాతం వరకు ధరలు పెంచినట్లు సమాచారం. మరికొన్ని ఉత్పత్తుల విషయంలో ధర పెంచకుండా ప్యాకెట్ పరిమాణాన్ని తగ్గించే విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. హిందూస్థాన్ యూనీలీవర్ వంటి పెద్ద సంస్థ ధరలు పెంచితే, ఇతర ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు కూడా అదే దారిలో నడిచే అవకాశముంది. దీంతో మార్కెట్‌లో మొత్తం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సిమ్ డీయాక్టివేట్ కాకుండా ఇలా చేయండి

మొబైల్ వినియోగదారులు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన కీలక విషయం వెలుగులోకి వచ్చింది. సిమ్ కార్డు ఎక్కువకాలం వాడకపోతే అది డీయాక్టివేట్ అయ్యే ప్రమాదం ఉందని టెలికాం నిపుణులు హెచ్చరిస్తున్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం, ఒక మొబైల్ నంబర్ వరుసగా 90 రోజుల పాటు ఎలాంటి వినియోగం లేకుండా ఉంటే, ఆ నంబర్‌ను టెలికాం కంపెనీలు నిలిపివేయవచ్చు.



అవుట్‌గోయింగ్ కాల్స్, డేటా వినియోగం లేదా రీఛార్జ్ లేకపోతే ఆ సిమ్‌ను డిస్‌కనెక్ట్ చేసే అధికారం కంపెనీలకు ఉంటుంది. ఒకసారి డీయాక్టివేట్ అయితే అదే నంబర్‌ను మళ్లీ పొందడం చాలా కష్టం. అంతేకాకుండా, ఆ నంబర్‌ను కొత్త వినియోగదారులకు కేటాయించే అవకాశం కూడా ఉంటుంది.

అయితే సిమ్ యాక్టివ్‌గా ఉంచుకోవడానికి పెద్ద మొత్తంలో రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం రూ.20 లోపే ఖర్చుతో కూడా మీ నంబర్‌ను సురక్షితంగా ఉంచుకోవచ్చు. నెలకు ఒకసారి లేదా రెండు నెలలకు ఒకసారి కనీసం రూ.10 లేదా రూ.19 టాక్‌టైమ్ రీఛార్జ్ చేయడం సరిపోతుంది.

అదేవిధంగా, కనీసం నెలకోసారి ఆ నంబర్ నుంచి ఒక కాల్ చేయడం లేదా ఒక మెసేజ్ పంపడం ద్వారా కూడా సిమ్ యాక్టివ్‌గా ఉంటుంది. ఇలా చేస్తే టెలికాం కంపెనీల రికార్డుల్లో ఆ నంబర్ వినియోగంలో ఉందని నమోదు అవుతుంది.

ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా వంటి సంస్థలు చిన్న టాక్‌టైమ్ ప్లాన్లను అందిస్తున్నాయి. వీటిని ఉపయోగించుకోవడం ద్వారా మీ సిమ్ కార్డును సులభంగా యాక్టివ్‌గా ఉంచుకోవచ్చు.

ముఖ్యంగా బ్యాంక్ ఖాతాలు, సోషల్ మీడియా వంటి సేవలు మీ మొబైల్ నంబర్‌కు లింక్ అయి ఉంటే, ఆ సిమ్ డీయాక్టివేట్ అయితే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే సెకండరీ సిమ్ అయినా సరే, క్రమం తప్పకుండా రీఛార్జ్ చేస్తూ యాక్టివ్‌గా ఉంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# 710 కి.మీ రేంజ్‌తో కొత్త ఎలక్ట్రిక్ కారు

ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో కొత్త సంచలనం సృష్టిస్తూ ప్రముఖ సంస్థ BYD తన తాజా ఎస్‌యూవీ 'సాంగ్ అల్ట్రా ఈవీ'ను విడుదల చేసింది. ఒకసారి పూర్తి ఛార్జ్ చేస్తే 710 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యంతో ఈ కారు మార్కెట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ వాహనానికి ప్రధాన హైలైట్ వేగవంతమైన ఛార్జింగ్ వ్యవస్థ. కేవలం 9 నిమిషాల్లోనే 97 శాతం వరకు ఛార్జ్ అవుతుందని కంపెనీ వెల్లడించింది. అదేవిధంగా 5 నిమిషాల్లో 10 నుంచి 70 శాతం వరకు ఛార్జ్ అయ్యే సౌకర్యం కూడా ఉంది.

పొడవు 4,850 మిల్లీమీటర్లు, వెడల్పు 1,910 మిల్లీమీటర్లు, ఎత్తు 1,670 మిల్లీమీటర్లుగా ఉండే ఈ కారు లోపల విస్తారమైన స్థలాన్ని అందిస్తుంది. 2,840 మిల్లీమీటర్ల వీల్‌బేస్‌తో ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పిస్తుంది.

బ్యాటరీ విషయంలో రెండు ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. 68.4 కిలోవాట్ బ్యాటరీతో 605 కి.మీ., 82.7 కిలోవాట్ బ్యాటరీతో 710 కి.మీ. వరకు ప్రయాణించవచ్చు. 362 హార్స్‌పవర్ శక్తితో పనిచేసే ఎలక్ట్రిక్ మోటార్ ఈ కారుకు మంచి పనితీరును అందిస్తుంది.



# తెలంగాణలో మద్యం ధరలు పెంపు దిశగా అడుగులు

తెలంగాణ రాష్ట్రంలో మద్యం ధరలను భారీగా పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నెల నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం మద్యం బ్రాండ్ల వారీగా ధరలు పెరగనున్నాయి. సాధారణ బ్రాండ్లపై ఒక్క ఫుల్ బాటిల్‌కు రూ.60 వరకు పెంపు ఉండగా, ప్రీమియం బ్రాండ్లపై రూ.100 వరకు, హయ్యర్ కేటగిరీ మద్యం బ్రాండ్లపై ఏకంగా రూ.120 వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ పెంపుతో మద్యం వ్యాపారులు మాత్రమే కాకుండా వినియోగదారులపై కూడా అదనపు భారం పడనుంది.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్రానికి అదనపు ఆదాయం అవసరమవడంతో, ఎక్సైజ్ శాఖ ద్వారా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ధరల పెంపు అమల్లోకి వస్తే ప్రతి నెల సుమారు రూ.250 కోట్ల అదనపు ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుందని అంచనా. వార్షికంగా ఇది దాదాపు రూ.3,000 కోట్లకు చేరే అవకాశముంది.

అయితే ఈ నిర్ణయం సామాన్య ప్రజలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, మద్యం వినియోగాన్ని కొంత మేర నియంత్రించడంలో కూడా ఈ ధరల పెంపు సహాయపడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తంగా, ఈ ప్రతిపాదన అమలు అయితే రాష్ట్రంలో మద్యం మార్కెట్‌పై గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశముంది.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 03 - మే 2026




# మృత్యు ఒడిలోనూ వీడని మాతృత్వం

- బార్గి డ్యామ్‌లో విషాదం
- మరణించినా బిడ్డను వీడని తల్లి ప్రేమానుబంధం!
- తల్లీకొడుకుల మరణం, కంటతడి పెట్టించిన దృశ్యం
- పర్యాటక భద్రతా లోపాలు, తొమ్మిది మంది బలి
- విచారణకు ఆదేశించిన పర్యాటక శాఖ

**జబల్‌పూర్, మే 2 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లాలోని బార్గి డ్యామ్‌లో జరిగిన ఘోర పడవ ప్రమాదం యావత్ దేశాన్ని కలచివేసింది. ఏప్రిల్ 30, గురువారం సాయంత్రం సుమారు 5:00 గంటలకు నర్మదా నదిపై పర్యాటక బోటు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా బలమైన తుపాను రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఢిల్లీకి చెందిన మెరీనా మస్సే (39), ఆమె నాలుగేళ్ల కుమారుడు త్రిషాన్ ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం రెస్క్యూ టీమ్ మృతదేహాలను వెలికితీసే సమయంలో కనిపించిన దృశ్యం అందరినీ కన్నీరు పెట్టించింది. మరణించినా కూడా ఆ తల్లి తన కుమారుడిని గుండెలకు గట్టిగా హత్తుకుని ఉండటం ఆమె మాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది.

ఢిల్లీ నుండి ఒక గృహప్రవేశం వేడుక కోసం జబల్‌పూర్ వచ్చిన ఈ కుటుంబంలో తండ్రి ప్రదీప్ కుమార్, కుమార్తె సియా ప్రాణాలతో బయటపడగా, తల్లి కుమారుడు మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయంలో బోటులో సుమారు 40 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గాలివాన తీవ్రతకు బోటు నియంత్రణ కోల్పోయి నిమిషాల వ్యవధిలోనే నీటిలో మునిగిపోయింది. సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ టీమ్ ఇప్పటివరకు సుమారు 28 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది పర్యాటకులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు.

పర్యాటక శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గురైన బోటులో తగినన్ని లైఫ్ జాకెట్లు అందుబాటులో లేవని ప్రాథమిక విచారణలో తేలింది. వాతావరణం అనుకూలించకపోయినా, తుపాను హెచ్చరికలు ఉన్నా ప్రయాణానికి అనుమతించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పర్యాటక శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దుర్ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ₹2 లక్షలు,



గాయపడిన వారికి ₹50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పర్యాటక ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఇలాంటి ప్రాణనష్టం తప్పదని ఈ ఘటన మరోసారి హెచ్చరించింది. అధికారులు ప్రస్తుతం నదిలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి ప్రాణం తృణప్రాయంగా మారుతోంది. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు కూడా తమ భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా బోటు ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు ధరించడం తప్పనిసరి చేయాలి. బాధ్యతాయుతమైన పర్యాటక రంగం ఉన్నప్పుడే ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. మరణించినా బిడ్డను వీడని ఆ తల్లి ప్రేమ అందరినీ కలచివేస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండటమే ఆ తల్లికి మనం ఇచ్చే అసలైన నివాళి. సామాన్య పౌరుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.



## గ్లోబల్ భాగస్వామ్యాలపై దృష్టి సారించిన భారత్

- న్యూఢిల్లీలో హెడ్ ఆఫ్ మిషన్స్ సదస్సులో పాల్గొన్న మోదీ
- వాణిజ్యం, సాంకేతికతపై విస్తృత చర్చలు
- ప్రవాస భారతీయులతో అనుబంధం బలోపేతం

**న్యూఢిల్లీ, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్ గ్లోబల్ స్థాయిలో తన పాత్రను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో, న్యూఢిల్లీలో జరిగిన హెడ్ ఆఫ్ మిషన్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సులో దేశ విదేశాంగ వ్యూహాలపై కీలక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా వాణిజ్యం, సాంకేతికత, వ్యూహాత్మక భాగస్వామ్యాల విస్తరణపై విస్తృతంగా చర్చించినట్లు ప్రధాని తెలిపారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. భారత్ గ్లోబల్ మార్కెట్లలో తన స్థానం మరింత బలపర్చేందుకు కొత్త అవకాశాలను అన్వేషిస్తున్నదని ఆయన తెలిపారు. వాణిజ్య ఒప్పందాలు, సాంకేతిక భాగస్వామ్యాలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనున్నాయని అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా ప్రవాస భారతీయులతో అనుబంధాన్ని మరింత బలపర్చడంపై కూడా చర్చలు జరిగాయి. విదేశాల్లో ఉన్న భారతీయులు దేశ అభివృద్ధికి కీలక భాగస్వాములని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచంతో అనుసంధానాన్ని పెంచుతూ, సమగ్ర అభివృద్ధిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్లోబల్ వేదికలపై భారత్ ప్రతిష్ఠను పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఈ సదస్సు ద్వారా భారత విదేశాంగ విధానానికి కొత్త దిశ లభించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి నవ్వే అసలైన ఔషధం

**డెస్క్, మే 02 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** మానవ జీవితంలో నవ్వు అనేది ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన వరం. ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నాడు ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. మే 3 ఆదివారం కావడంతో ఈ రోజుకు మరింత ప్రాధాన్యత చేకూరింది. మనిషి తన దైనందిన జీవితంలో ఎదుర్కొనే రకరకాల ఒత్తిళ్లను అధిగమించడానికి నవ్వు ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. చిరునవ్వు చిందించడం వల్ల ముఖ కండరాలు ఉత్తేజితం కావడమే కాకుండా మనసులోని భారమంతా తొలగిపోతుంది. అందుకే నవ్వును మించిన వ్యాయామం మరొకటి లేదని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. నవ్వడం వల్ల మన శరీరంలో ఎండార్ఫిన్లు అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి సహజ సిద్ధమైన నొప్పి నివారిణలుగా పనిచేస్తూ మనల్ని ఉత్సాహంగా ఉంచుతాయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత కరువవుతున్న తరుణంలో నవ్వు ప్రాముఖ్యతను చాటిచెప్పడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. నవ్వు అనేది కేవలం పెదవుల మీద మెరిసే మెరుపు మాత్రమే కాదు, అది మన గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. గట్టిగా నవ్వినప్పుడు ఊపిరితిత్తులకు ఎక్కువ ప్రాణవాయువు అందుతుంది. దీనివల్ల రక్త ప్రసరణ సాఫీగా జరిగి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ప్రపంచ నవ్వుల దినోత్సవం 1998లో ముంబైలో డాక్టర్ మదన్ కటారియా నేతృత్వంలో



ప్రారంభమైంది. లాఫ్టర్ యోగా ఉద్యమ వ్యవస్థాపకుడైన ఆయన, ప్రపంచ శాంతి కోసం నవ్వును ఒక సాధనంగా ఉపయోగించాలని పిలుపునిచ్చారు. అప్పటి నుండి ఈ దినోత్సవం అంతర్జాతీయ స్థాయికి విస్తరించింది. ప్రస్తుతం అనేక దేశాల్లో మే నెల మొదటి ఆదివారం నాడు లాఫ్టర్ క్లబ్ సభ్యులు సమావేశమై సామూహికంగా నవ్వుతూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. కుల మతాలకు, భాషా భేదాలకు అతీతంగా మానవాళిని ఏకం చేసే శక్తి నవ్వుకు ఉంది. ఇది మనుషుల మధ్య అనుబంధాలను బలపరుస్తుంది. ఆధునిక కాలంలో వస్తున్న అనేక వ్యాధులకు మానసిక ఒత్తిడి ప్రధాన కారణం. పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మనుషులు నవ్వడమే మర్చిపోతున్నారు. దీనివల్ల రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యలు పెరుగుతున్నాయి. నవ్వు వల్ల మెదడులో ఆందోళన తగ్గుముఖం పట్టి సానుకూల దృక్పథం పెరుగుతుంది. కష్టాల్లో ఉన్నప్పుడు కూడా ఒక చిన్న చిరునవ్వు మనకు ధైర్యాన్ని ఇస్తుంది. ఎదుటివారికి మనం ఇచ్చే అత్యంత విలువైన బహుమతి చిరునవ్వు. పసిపిల్లల నిష్కల్మషమైన నవ్వు ఇంటి వాతావరణాన్నే మార్చేస్తుంది. కేవలం ఏదో ఒక రోజే కాకుండా ప్రతిరోజూ నవ్వుతూ గడపడం మన జీవనశైలిలో భాగం కావాలి.

# అద్దె ఇళ్ల మంట

- సామాన్యుడికి అందని 'సొంత గూడు' కల!
- ఆకాశాన్నంటుతున్న రియల్ ఎస్టేట్ ధరలు
- మధ్యతరగతిపై భారంగా మారిన అద్దెలు
- నియంత్రణ లేని డిపాజిట్లు, షరతులు




**డెస్క్, మే 02 (తెలంగాణ ముచ్చట్లు):** నగరాల్లో నివసించే మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలకు అద్దె ఇళ్ల సమస్య ఒక పీడకలగా మారుతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో భూముల ధరలు, నిర్మాణ సామాగ్రి ఖర్చులు విపరీతంగా పెరగడం నేరుగా అద్దె ఇళ్లపై ప్రభావం చూపుతోంది. గతంలో అందుబాటులో ఉన్న అద్దెలు ఇప్పుడు రెట్టింపు కావడంతో సామాన్యులు తమ ఆదాయంలో సగానికి పైగా కేవలం ఇంటి అద్దెకే కేటాయించాల్సి వస్తోంది. సొంత గూడు నిర్మించుకోవడం తలకు మించిన భారంగా మారిన తరుణంలో, కనీసం అద్దె ఇంట్లోనైనా ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహాల లభ్యత లేకపోవడం డిమాండ్‌ను పెంచుతోంది. నగరాల్లోని ప్రధాన ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతుంటే, సామాన్యులు శివారు ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. అయితే అక్కడ కూడా రవాణా ఖర్చులు, సమయం వృధా కావడం మరో సమస్యగా మారుతోంది. రియల్ ఎస్టేట్ ధరల పెరుగుదలను ఆసరాగా చేసుకుని ఇంటి యజమానులు ఏటా అడ్డగోలుగా అద్దెలు పెంచుతున్నారు. అద్దె నియంత్రణ చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం వల్ల అద్దెదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం అద్దె మాత్రమే కాకుండా అడ్వాన్స్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడం మరో ప్రధాన సమస్య. కొన్ని చోట్ల పది నెలల అద్దెను డిపాజిట్‌గా అడగడం పేద, మధ్యతరగతి వారికి పెను భారంగా మారుతోంది. దీనికి తోడు మెయింటెనెన్స్ ఖర్చులు, కరెంట్ బిల్లుల భారం అదనం. ఇంటి అద్దెకు దిగేటప్పుడు యజమానులు పెడుతున్న వింత షరతులు అద్దెదారుల స్వేచ్ఛను హరిస్తున్నాయి. బ్యాచిలర్లకు ఇళ్లు ఇవ్వకపోవడం, కొన్ని రకాల ఆహార నియమాలు పాటించాలని ఒత్తిడి చేయడం వంటివి సామాజిక వివక్షకు దారితీస్తున్నాయి. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అద్దెల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్న ప్రతిచోటా కృత్రిమంగా ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఆ ప్రాంతాల్లో నివసించే అవకాశాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణ రంగంలో జోక్యం చేసుకుని అద్దెదారుల రక్షణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో భవిష్యత్తులో గూడు లేని జనాభా పెరిగిపోయే ప్రమాదం ఉంది. తక్కువ ధరలో అద్దె ఇళ్ల లభ్యతను పెంచడంపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు కేవలం భూములకే పరిమితం కాకుండా సామాన్యుడి జీవనశైలిని దెబ్బతీస్తున్నాయి. అద్దె ఇళ్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థల ద్వారా పర్యవేక్షణ పెంచాలి. అద్దె ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలి. సామాన్యుడికి గూడు కల్పించడం అనేది వ్యాపారం కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించాలి. అప్పుడే మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోగలవు. అద్దె భారం తగ్గితేనే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు కొత్త ప్రయోగం

భారతీయ సినీ చరిత్రలో వినూత్న ప్రయోగాలకు పేరుగాంచిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. 94 ఏళ్ల వయసులో కూడా ఆయన మళ్లీ మెగాఫోన్ పట్టి కొత్త సినిమా రూపొందించడం సినీ వర్గాల్లో విశేష చర్చకు దారి తీసింది.




ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో కూడా నటించిన ఈ తాజా చిత్రం 'సింగ్ గీతం'. ఈ చిత్ర టీజర్‌ను తాజాగా చిత్ర బృందం విడుదల చేయగా, అందులో చూపించిన కాన్సెప్ట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సంగీతానికి ప్రధాన ప్రాధాన్యం ఇచ్చిన విభిన్న కథాంశంతో ఈ సినిమా రూపొందినట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది.

ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ సమర్పకుడిగా వ్యవహరించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరం మారుతున్నప్పటికీ సింగీతం శ్రీనివాసరావుపై ఉన్న గౌరవాన్ని ఇది మరింత పెంచిందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

సంగీతాన్ని స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ అందించగా, ఆయన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు బలం చేకూర్చిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి సన్నివేశంలో సంగీతానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక ఈ సినిమాను జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. విడుదల తేదీ ప్రకటించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

ఈ వయసులో కూడా కొత్త ప్రయోగాలకు సిద్ధమవుతూ, సినిమా పట్ల తన అభిరుచిని కొనసాగిస్తున్న సింగీతం శ్రీనివాసరావు ధైర్యం, ఉత్సాహం సినీ ప్రముఖులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆయన నుంచి మరో వినూత్న సినిమా రావడం పట్ల ఇండస్ట్రీలో హర్షం వ్యక్తమవుతోంది.



# మహేష్ మేనకోడలు జాహ్నవి ఫోటోలు వైరల్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుటుంబం నుంచి మరో యువ వారసురాలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఆయన సోదరి మంజుల ఘట్టమనేని కుమార్తె జాహ్నవి స్వరూప్ తాజా ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే కొన్ని యాడ్ వీడియోల ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన జాహ్నవి, ఇప్పుడు తన లేటెస్ట్ లుక్స్‌తో మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. బ్లాక్ డ్రెస్‌లో సింపుల్‌గా కనిపించినా, హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని అందంతో మెప్పిస్తోంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు "ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరోయిన్ రెడీ అవుతోంది" అంటూ కామెంట్లు చేస్తున్నారు.జాహ్నవికి కెమెరా కొత్త కాదు. చిన్న వయసులోనే ఆమె మనసుకు నచ్చింది సినిమాలో బాలనటిగా కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. ఆ సినిమా ద్వారా తన తల్లి దర్శకత్వంలోనే ఆమె మొదటిసారి తెరపై కనిపించింది.మంజుల ఘట్టమనేని ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ కుమార్తెలో ప్రతిభ ఉన్నప్పటికీ, చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి నెట్టకుండా సాధారణ బాల్యాన్ని ఆస్వాదించనివ్వాలనే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం జాహ్నవి చదువుపై దృష్టి పెట్టిందని, సరైన సమయంలోనే పూర్తి స్థాయి ఎంట్రీ గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు.

# ఈ వీకెండ్ ఓటీటీల్లో సినిమాల జాతర




ఈ వీకెండ్ ఓటీటీ ప్రియులకు నిజంగా పండగ వాతావరణం నెలకొంది. తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషలకు చెందిన కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకేసారి స్ట్రీమింగ్ అవుతున్నాయి. నెట్‌ఫ్లిక్స్‌లో ఈసారి క్రేజీ కంటెంట్ వరుసగా విడుదలైంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'బైకర్' సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అదే విధంగా 'రాకాస' సినిమా కూడా బహుభాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. అంతర్జాతీయ వెబ్ సిరీస్‌లలో 'మ్యాన్ ఆన్ ఫైర్', 'షుడ్ ఐ మ్యారీ ఏ మర్డరర్', 'స్వాప్డ్' వంటి సిరీస్‌లు వివిధ భాషల్లో అందుబాటులోకి వచ్చాయి. ఇంగ్లీష్ సిరీస్‌లలో 'పార్ట్ టైమ్ వైఫ్', స్పానిష్ సిరీస్ 'మై డియరెస్ట్ సెనోరిటా', జపనీస్ సిరీస్ 'స్ట్రెయిట్ టు హెల్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. జీ5లో మలయాళ హిట్ 'ఆడు 3' పలు భాషల్లో విడుదల కాగా, 'ద కేరళ స్టోరీ 2' కూడా తెలుగు సహా పలు భాషల్లో అందుబాటులో ఉంది. ఆహా ఓటీటీలో 'సోదర', 'సీతారామ సిత్రాలు' సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈటీవీ విన్‌లో 'సోల్ ట్రిప్' రెండో ఎపిసోడ్, 'ఆరాధన' సినిమాలు స్ట్రీమింగ్ అవుతున్నాయి.



# నెలకు రూ.5 లక్షల ఖర్చు.. నిధి షాకింగ్ కామెంట్స్

సినిమా ఇండస్ట్రీలో అందం, ప్రతిభ ఉన్నప్పటికీ అదృష్టం కలిసి రాని హీరోయిన్స్ చాలామందే ఉన్నారు. అయితే అలాంటి పరిస్థితుల్లో కూడా తన క్రేజ్‌ను నిలబెట్టుకున్న నటీమణుల్లో నిధి అగర్వాల్ ఒకరు. వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ గ్లామర్ క్వీన్ తాజాగా తన నెలవారీ ఖర్చుల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తెలుగులో 'సవ్యసాచి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన నిధి అగర్వాల్, 'ఇస్మార్ట్ శంకర్'తో మంచి గుర్తింపు సంపాదించింది. గ్లామర్, నటనతో తక్కువ సమయంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆమె, ఇటీవల పాన్ ఇండియా స్థాయి చిత్రాల్లో కూడా నటించింది. అయితే ఆ సినిమాలు ఆశించిన విజయాన్ని అందించకపోయినా, ఆమెకు ఉన్న ఫాలోయింగ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్ తన ఖర్చుల గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు వెల్లడించింది. "నెలకు సుమారు రూ.5 లక్షలు ఖర్చవుతుంది" అని చెప్పింది. తన ట్రావెలింగ్, బస, డైట్, జిమ్, ట్రైనర్, పార్లర్ ఖర్చులకే ఈ మొత్తం వెళ్తుందని వివరించింది. అదనంగా మేకప్, హెయిర్ స్టైలింగ్, ఫోటోషూట్ల వంటి ఖర్చులు కొన్ని సందర్భాల్లో ఈవెంట్ నిర్వాహకులు భరిస్తారని, మరికొన్ని సందర్భాల్లో తానే భరించాల్సి వస్తుందని తెలిపింది. ఈ ఖర్చులు స్టార్ హీరోయిన్ల జీవనశైలిలో భాగమేనని ఆమె వ్యాఖ్యానించింది. సక్సెస్‌లు పెద్దగా లేకపోయినా, తన స్టైల్, గ్లామర్‌తో ఎప్పటికప్పుడు ట్రెండ్‌లో ఉండగలగడం నిధి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారి తీస్తున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in